క్లుప్తంగా

స్నేహితురాలికి చేయూత

కోహెడరూరల్(హుస్నాబాద్): వారంతా చిన్ననాటి స్నేహితులు కలిసి మెలసి చదువుకున్నారు. పెరిగి పెద్దయి ఎవరికి వారు జీవితాల్లో స్థిరపడ్డారు. తమతో చదువుకున్న స్నేహితురాలు భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచి స్నేహబంధాన్ని చాటుకున్నారు. మండల కేంద్రంలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన కంకణాల రజిత భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న స్నేహితులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి స్నేహితురాలి రజితకు రూ.72,500లు ఆర్థికసాయం అందించారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్), జిల్లెలగడ్డ, మీర్జాపూర్ గ్రామాల్లో బుధవారం ఈవీఎంల వినియోగంపై రెవెన్యూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు మిషన్లపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు హక్కు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుహాసిని, కరీం, సర్పంచ్‌లు బత్తిని సాయిలు, లావుడ్య స్వరూప, తరాల లత పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాకటౌన్: ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. రానున్న 24 గంటల్లో సిద్దిపేట జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో లోతట్టు ప్రాంతాలకు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, కరెంట్ స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో తహసీల్దార్‌లు, ఎంపీడీఓ లు, సెక్రటరీలు, సర్పంచ్‌లు సమన్వయంతో ఉండి గ్రామాల్లో ప్రజలకు ఏవైనా సమస్య లు వస్తే వెంటనే వెళ్లి పరిష్కరించాలన్నారు. ఇప్పటికే అధికారులకు అందుబాటులో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు.


మహిళలు స్వయం ఉపాధి పొందాలి

సిద్దిపేటఅర్బన్: ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి పొందాలని అర్బన్ మండల వైస్ ఎంపీపీ ఎల్లం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, పొన్నాల గ్రామాల్లో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేణుకాశ్రీనివాస్, వంగ లక్ష్మి, ఎంపీటీసీ మమత, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బాల్‌రంగం, ఏపీఎం చంద్రం, సీఏలు సుష్మ, వనజ, బీఆర్ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షుడు యాదగిరి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనకు పోరాటం ముమ్మరం

గజ్వేల్: పాత పెన్షన్ సాధనకు పోరాటం ముమ్మరం చేస్తామని (జేఎఫ్ఓపీఎస్) బాధ్యులు సత్యనారాయణ, చంద్రారెడ్డి, రాజులు, వలీ ఆహ్మద్, సుంచు నరేందర్, విద్యాసాగర్‌లు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఫోరమ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాపిరెడ్డి, శంకర్, పర్వతం నర్సయ్య, శేషాచారి, సత్తయ్య, నాగరాజు, రాములు, శ్రీనివాస్, కర్ణాకర్, ధమ్మని మల్లేశం, రవీందర్, రాంచంద్రం, నర్సింహ, సక్రియ తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షం.. మురుగు దుర్గంధం



వర్గల్ బస్టాండ్ వద్ద చెత్తకుప్పలు

వర్గల్(గజ్వేల్): ఓ వైపు ముసురు వాన, మరో వైపు పంచాయతీ కార్మికుల సమ్మెతో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పలతో దుర్గంధం వెదజల్లుతోంది. వర్గల్ మండల కేంద్రంలో జనావాసాల చేరువలో చెత్త ముగిగిపోయి కంపు కొడుతోంది. కార్మికులు సమ్మెబాట పట్టడడంతో ఊళ్లలో చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. ప్రజారోగ్యం దృష్ట్యా చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాక్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

- రూ.10కోట్లతో వృత్తి నైపుణ్య భవన నిర్మాణం
- ఎల్లుపల్లి కేజీబీవీలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన
- రంగధాంపల్లి వద్ద ఆర్వోబీకి శంకుస్థాపన
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటఅర్బన్: మందపల్లి శివారులో న్యాక్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: న్యాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఏర్పాటుతో ఉమ్మడి మెదక్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు నిర్మాణ రంగంలో ఉపాధికి మరిన్ని అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి శివారులో రూ.10 కోట్లతో నిర్మించనున్న న్యాక్ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ పాటిల్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సిద్దిపేటలో నిర్మించే న్యాక్ భవనం రాష్ట్రంలోనే మోడల్‌గా ఉండేలా నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవనం అందుబాటులోకి వస్తే ఎల్అండ్‌టీ సంస్థ ప్రతి ఏటా 300 మంది యువతకు నిర్మాణ రంగంలో శిక్షణ లభించనుందని తెలిపారు. యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా న్యాక్ భవనాన్ని ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో 'నో అడ్మిషన్' బోర్డులు అభినందనీయం..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాలికా విద్యకు కేజీబీవీలు నిలయాలుగా మారాయని, జిల్లాలోని 17 కేజీబీవీల్లో పూర్తి అడ్మిషన్లు జరగడం అభినందనీయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అర్బన్ మండలం ఎల్లుపల్లిలోని కేజీబీవీలో ఇంటర్ తరగతుల నిర్వహణకు రూ.2.30కోట్లతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

భోజనం ఎలా ఉంది, మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అంటూ కేజీబీవీ విద్యార్థినులతో మంత్రి హరీశ్‌రావు ముచ్చటించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం గుడ్డుతో కూడిన భోజనం, సాయంత్రం నాణ్యమైన భోజనం అందిస్తున్నారని, ఆదివారం చికెన్‌తో భోజనం వడ్డిస్తున్నారని విద్యార్థినిలు మంత్రికి వివరించారు. కేజీబీవీలో ల్యాబ్ సౌకర్యం కల్పించాలని ఇంటర్ విద్యార్థినిలు మంత్రిని కోరగా.. వెంటనే మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. అనంతరం విద్యార్థినిలతో ఆత్మీయంగా మాట్లాడారు.

ఆర్వోబీ నిర్మాణానికి భూమిపూజ

మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్‌పై సిద్దిపేట శివారులోని రంగధాంపల్లి వద్ద మెదక్–ఎల్కతుర్తి జాతీయ రహదారిపై రూ.55కోట్లతో నిర్మించనున్న నాలుగు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మందపల్లి సర్పంచ్ రాజయ్య, ఎల్లుపల్లి సర్పంచ్ జయశ్రీరమేశ్, రంగధాంపల్లి కౌన్సిలర్ రేణుకాతిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంతోషీమాత ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు, పాలకవర్గ సభ్యులు మంత్రి హరీశ్‌రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల విరాళాలతో తయారు చేసిన వెండి మకర తోరణాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత యోగా శిక్షణ శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి రూ.50లక్షలు కేటాయించామన్నారు. వచ్చే శ్రావణ మాసం వరకు తూర్పు ద్వారా రాజగోపురం నిర్మించుకోనున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

అన్ని రంగాల్లో సిద్దిపేటను ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, సిద్దిపేట ప్రజలే తన కుటుంబం అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన పలువురు యువకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు.

వైద్య సిబ్బందితో మంత్రి మాటామంతి

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతుల నిరసన, రుతుప్రేమ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు మార్గ మధ్యలో తన వాహనాన్ని ఆపి వైద్య సిబ్బందితో మాటామంతి కలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు ప్రియదర్శిని, ఏఎన్ఎం శోభలతో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వైద్యులకు అందిస్తున్న సేవలను గూర్చి అడిగి తెలుసుకున్నారు.

నిరుద్యోగులకు సెట్విన్ ఓ వరం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ఎలాంటి క్వాలిఫికేషన్ అవసరం లేదు, ఫీజు కట్టనక్కరలేదు. ఇక్కడ శిక్షణ తీసుకుంటే జాబ్ గ్యారంటీ. తమ కాళ్లపై తాము నిలబడాలి అనుకునే వారికి సెట్విన్ శిక్షణా కేంద్రం ఓ వరమని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో 1500 మందికి ప్రత్యేకించి భవన నిర్మాణ కార్మిక కుటుంబ సభ్యులకు శిక్షణతో పాటు మిషన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి చెప్పా రు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో బుధవారం సెట్విన్ ఆధ్వర్యంలో 500 మంది మహిళలకు కర్టెన్స్, గార్మెంట్స్, స్టిచింగ్ శిక్షణ కార్యక్రామాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేరకు బ్యూటీషియన్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, గార్మెంట్స్ మేకింగ్ డిప్లొమా ఏడాది శిక్షణ పొందిన మహిళలకు మంత్రి చేతు ల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రాణి కౌముదిని, సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సెట్విన్ జిల్లా ఇన్‌చార్జి అమీనా, మార్కెట్ కమిటీ చైర్మన్ విజితవేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): వ్యవసాయ రంగానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని పేర్కొన్న కాంగ్రెస్ పార్టీని తెలంగాణ నుంచి తరిమికొట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దాచారం గ్రామంలోని రైతువేదికలో చేపట్టిన తీర్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరెంట్ కోతలు, సాగునీటి సౌకర్యం లేక పంటలు ఎండిపోయాయని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి 24గంటలు ఉచిత విద్యుత్ అందిస్తే తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గెలిచేది బీఆర్ఎస్ సర్కార్ అని స్పష్టం చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ చంద్రకళ, రైతుబంధు సమితి అధ్యక్షుడు ఒంటేల సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): నులి పురుగుల నివారణపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ అమీనా సుల్తానా కోరారు. మిరుదొడ్డి పీహెచ్‌సీలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నులి పురుగుల నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో డీ వార్మింగ్ డే నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, పీహెచ్‌సీ సీహెచ్ఓ లింగమూర్తి, వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, స్వర్ణలత, శ్రీనివాస్, చంద్రశేఖరశర్మ, వైద్య సిబ్బంది సుధీర్, సుజాత, అంబేడ్కర్ పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలి

సిద్దిపేటకమాన్: వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థకు చేరిన గృహాల్లో నివాసం ఉండొద్దని, ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని 33వ వార్డులో శిథిలావస్థకు చేరిన గృహాలను మున్సిపల్ కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇంకా ఎక్కడైనా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ప్రజలు ఉంటే గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

బాలాజీగుప్తా సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న నర్సారెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం చైర్మన్‌గా దివంగత చిట్టిమల్ల బాలాజీగుప్తా సేవలు చిరస్మరణీయమని గజ్వేల్, రామాయంపేట మాజీ ఎమ్మెల్యేలు తూంకుంట నర్సారెడ్డి, ఆర్ విఠల్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాచగిరి వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సత్రంలో రాజమౌళి అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో బాలాజీగుప్తా అకాల మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘన నివాళులర్పించారు. రెండు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ బాలాజీగుప్తా అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సత్రం ఉపాధ్యక్షుడు కొమురవెల్లి శంకరయ్య, నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాండురంగం, నాయకులు సత్యనారాయణ, పల్లెర్ల రవీందర్, శ్రీరామ్ రంగయ్య, జూలూరి రంగయ్య, పొద్దుటూరి పాండురంగం, వెంకటయ్య, కల్యాణ్, నాయిని యాదగిరి, ముత్యాలు, యాదగిరిగౌడ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వం**

నంగునూరు(సిద్దిపేట): వ్యవసాయానికి పది గంటల కరంట్ ఇచ్చి 24 గంటలు ఇస్తున్నామని ప్రభుత్వం రైతులను మభ్యపెడుతోందని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంగునూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. లాగ్‌బుక్‌ను పరిశీలించగా మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గంలోనే పరిస్థితి ఇటా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, యాదగిరి, నాగరాజు, కృష్ణ, సంపత్, శ్రీనివాస్, దాసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మత్స్యకారుల సభ్యత్వ నిబంధనలు సడలించాలి**

హుస్నాబాద్‌రూరల్: మత్స్యకారులకు ఊరు చెరువు విస్తీర్ణాన్ని బట్టి సొసైటీలో సభ్యత్వం ఇస్తున్నారని దీనిని తొలగించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆ సంఘం నాయకుడు పెండ్యాల అయిలయ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో వినోద్‌కుమార్‌ను కలిసి మత్స్యకారుల సమస్యలను వివరించారు. ప్రభుత్వం అందరికీ సభ్యత్వం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిన నీటి విస్తీర్ణం నిబంధన సొసైటీ సభ్యత్వానికి అడ్డు వస్తుందని దీనిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించి అందరికీ సభ్యత్వం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

◆ **భవనం పనులు బదలాయింపు**

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న బంజారా భవనం త్వరగా నిర్మించేలా ట్రైబల్ వెల్ఫేర్ నుంచి పంచాయతీరాజ్‌కు బదలాయిస్తూ మంత్రి హరీశ్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీపీ మాలోతు లక్ష్మీభీలునాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ గిరిజన బిడ్డలకు బంజారా భవనం త్వరగా అందుబాటులో తీసుకొచ్చేలా పంచాయతీరాజ్ అధికారులు పనులను దగ్గరుండి పర్యవేక్షించి పూర్తి చేయించాలని వారు విడుదల చేసి ఉత్తర్వులో పేర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌లకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షం



మిరుదొడ్డి(దుబ్బాక): ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపునీరు

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో చెరువులు, చిన్న చిన్న కుంటలు సైతం జలకళను సంతరించుకున్నాయి. కూడవెల్లి వాగులోని చెక్‌డ్యామ్‌లు పొంగి పొర్లుతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కాగా మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ సరైన మురుగు కాల్వలు లేకపోవడంతో వర్షపునీరు నిలిచి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కార్యాలయాలోకి వెళ్లడానికి ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

గుంతలమయమైన బస్టాండ్ ఆవరణ



బస్టాండ్ ఆవరణలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గజ్వేల్‌రూరల్: అభివృద్ధిలో గజ్వేల్‌ను ఆదర్శంగా నిలుపుతున్నామని గొప్పలు చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ నడిబొడ్డున ఉన్న బస్టాండ్ నిర్మాణంలో జాప్యమెందుకు చేస్తుందో చెప్పాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ ప్రశ్నించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రజలు ప్రతి నిత్యం వేలాది మంది నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్‌కు రాకపోకలు సాగిస్తుంటారని, పట్టణంలో ఉన్న బస్టాండ్ ఆవరణ గుంతలమయమై వర్షపు నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే కాలంలో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమీర్, గణేశ్, మీర్జా జామీర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపించేలా..



చెరువును తలపిస్తున్న బస్టాండ్ లోపలికే వెళ్లే ప్రధానమార్గం

దుబ్బాక: పట్టణంలో ఇటీవల నిర్మించిన బస్టాండ్ ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోయింది. బస్టాండ్ లోపలికి వెళ్లే ప్రధాన మార్గంలోనే వర్షపు నీరు మడుగు కట్టడంతో బస్టాండ్ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో నడుస్తూ చెత్త వేరుచేయుట కార్యక్రమం బుధవారం జోరు వర్షంలోనూ నిర్వహించారు. దీంతో పట్టణవాసులు మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, వార్డు కౌన్సిలర్ వడ్లకొండ సాయికుమార్, పర్యావరణ ప్రేమికులు డాక్టర్ శాంతితో కలిసి వార్డులో పర్యటిస్తూ చెత్తను సేకరించారు. వార్డులో పర్యటిస్తూ ఇళ్లలోని మహిళలతో మాట్లాడుతూ.. ఎవరు ఆరుబయట చెత్త వేయొద్దని కేవలం మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు.

ప్రతిపక్షాలకు గుణపాఠం తప్పదు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ఏర్పాటు తర్వాత 24 గంటల ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముస్త్యాల రైతు వేదికలో ఉచితవిద్యుత్ పంపిణీపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నిర్వహించిన రైతుల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైన 24 గంటల విద్యుత్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. ఏడాదికి మూడు పంటలు బీఆర్ఎస్ నినాదమని, మూడు గంటల కరెంట్ కాంగ్రెస్ విధానమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, రైతు బంధు సమితి మండల కో–ఆర్డినేటర్ తాడెం రంజిత, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సర్పంచ్‌లు పెడతల ఎల్లారెడ్డి, కొండపాక భిక్షపతి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, ఎంపీటీసీ శివశంకర్, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి అంజయ్య, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పార్వతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగల ఏకానందం, యూత్ అధ్యక్షుడు రాజేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సదానందం, నాయకులు శ్రీనివాస్, కనకయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ



ఘణపూర్ వద్ద నిండు కుండలా చెక్‌డ్యామ్



చేర్యాల(సిద్దిపేట): ఇళ్ల మధ్యకు చేరిన నీటిలో కాలనీవాసులు

నంగునూరు(సిద్దిపేట): రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నంగునూరు మండలం గుండా పారే మోయతుమ్మెద వాగు పొంగి ప్రవహిస్తోంది. ఖాత చెక్‌డ్యామ్ నిండి ఉధృతంగా ప్రవహించడంతో ఘణపూర్ వద్ద నిర్మించిన మూడు డ్యామ్‌లు మత్తడి దూకుతున్నాయి. ప్రవాహ ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో కాజ్‌వే కింది నుంచి నీరు ప్రవహిస్తూ అక్కేనపల్లి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌లోకి భారీగా నీరు చేరుతోంది. దీంతో వాగు పరివాహక ప్రాంతం జలకళ సంతరించుకుంది.

వర్షానికి కూలిన ఇళ్లు

దుబ్బాక: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దుబ్బాక పట్టణంలో బుధవారం 15వ వార్డుకు చెందిన కడవేర్గు కళావతి అనే వృద్ధురాలి ఇళ్లు కూలిపోయింది. దీంతో అమె పరిస్థితి దయనీయంగా మారింది. అదేవిధంగా పట్టణానికి చెందిన రాజిరెడ్డి పశువుల కొట్టం వర్షానికి పూర్తిగా కూలిపోయింది. అధికారులు స్పందించి కూలిన ఇళ్లకు పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

దుబ్బాకరూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్బర్‌పేట–భూంపల్లి మండలం కూడవెల్లి వాగు నిండి పొర్లుతోంది.

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల బస్టాండ్ సమీపంలోగల రోడ్డు మీద గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించి కనీసం మట్టి అయినా పోసి గుంతలు పూడ్చాలని, అదేవిధంగా రోడ్డుపైకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండల పరిధిలోని ఆకునూరు ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్యకు నీరు చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు ఇళ్ల మధ్యకు రాకుంగా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని వాగు పొంగి పొర్లడంతో పలు చెక్‌డ్యామ్‌లు అలుగులు పోస్తున్నాయి. దీంతో ఉమ్మడి మండలంలో ఎటు చూసిన జలకళను సంతరించుకుంది.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ వద్ద ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామ శివారులోని హన్మకొండ–సిద్దిపేట ప్రధాన రహదారి లోలెవల్ వంతెన పైనుంచి మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ముందు జాగ్రత్తగా బస్వాపూర్ వద్ద వాహనాలు రాకుండా పోలీసులు వాహనాలను పొరెడ్డిపల్లి, లక్ష్మీపూర్ మీదుగా దారి మళ్లించారు.